www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 09 | అక్టోబర్ | 2025 పేజీలు : 8

# నామినేషన్లపై స్టేకు నిరాకరణ




-నేడు స్థానిక సంస్థలకు నోటిఫికేషన్....?
-రెండు విడతల్లో ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు
-నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ షురూ

2 లో

# జన్నారంలో మట్టి మాఫియా..!

-చేష్టలుడిగిన రెవెన్యూ శాఖ
-అనుమతులు ఉన్నాయంటూ అర్ధరాత్రి తోలకాలు
-మాఫియా గుప్పెట్లో అధికార యంత్రాంగం



**ప్రజాపక్షం/ఖమ్మం/ఏన్కూరు :** మట్టి మాఫియా యథేచ్ఛగా మట్టి గుట్టలను తరలించుకుపోతుంది. గతంలో కలెక్టర్ మట్టి తోలకాలపై నిషేధం విధించినా మాఫియా మాత్రం మమ్మల్ని ఎవరు ఆపలేరంటూ తమ పని తాము చేసుకుపోతున్నారు. ఏన్కూరు మండలంలో మట్టి తోలకాలపై గత కలెక్టర్ కన్నెర్ర చేశాడు. జన్నారం రెవెన్యూలోని సర్వే నెం.200 లో ఎట్టి పరిస్థితుల్లోనూ మట్టిని తరలించడానికి వీలు లేదంటూ ఆదేశాలు జారీ చేశారు. మిగతా 2లో..

# ఆగని ఆక్రమణలు.. మంత్రి ఆదేశాలు బేఖాతర్

-కాలువలపై కొనసాగుతున్న నిర్మాణాలు
-మళ్లీ ఆక్రమణల వైపు గొల్లగూడెం ఎన్నెస్పి కాలువ



2 లో

## ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీగా మార్చాలి



2 లో

-ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి
-సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



# నామినేషన్లపై స్టేకు నిరాకరణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** స్థానిక ఎన్నికలపై రిజర్వేషన్ రగడ కొనసాగుతున్న నేపథ్యంలో హైకోర్టు నామినేషన్ల స్వీకరణపై స్టే విధించాలన్న పిటిషనర్ వాదనలను తోసిపుచ్చింది. నామినేషన్ల స్టేను ఇవ్వలేమని ప్రకటించిన నేపథ్యంలో నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు గురువారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్రం మొత్తం ఎదురు చూసిన రిజర్వేషన్ల ప్రక్రియపై హైకోర్టు వాదనలను రేపటికి వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులతో పాటు పిటిషనర్ తరుపున న్యాయవాదులు కూడా తమ వాదనలను వినిపించారు. రెండు దఫాలుగా బుధవారం వాదనలు జరిగిన అనంతరం గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు మొదటి విడత జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ విడుదలైతే గురువారం నుంచే నామినేషన్లను స్వీకరించనున్నారు. తొలి దశ ఎన్నికలు అక్టోబర్ 23న, మలిదశకు 13 నుంచి నామినేషన్లు స్వీకరించనుండగా 27న ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 11న ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదేవిధంగా మూడు దశల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కూడా చేపట్టనున్నారు. మొత్తంగా రాష్ట్రం యావత్ హైకోర్టు తీర్పు కోసం ఎదురు చూసింది. రాజకీయ నాయకులతో పాటు సామాన్యులు కూడా తీర్పు కోసం వేచి చూశారు. స్థానిక ఎన్నికలు ఖర్చుతో కూడుకుని ఉండడం ఒకవేళ తీర్పు రిజర్వేషన్ ప్రక్రియకు ప్రతికూలంగా వస్తే ఏమిటన్న మీమాంస పోటీ చేయాలనుకునే వారి మదిని తొలుస్తున్నది. తీరా ఖర్చు జరిగిన తర్వాత ప్రతికూల తీర్పు వస్తే ఇదంతా వృథా కదా అనే భావన వ్యక్తమవుతుంది. మొత్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన గురువారం వెలువడే తీర్పు ప్రధానం కానుంది.

# ఆగని ఆక్రమణలు.. మంత్రి ఆదేశాలు బేఖాతర్

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వం ఎన్ని కఠిన చర్యలు తీసుకున్నా ఆక్రమణదారులు యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో భవనాలను నిర్మిస్తూనే ఉన్నారు. జిల్లాలోనే అత్యంత వివాదస్పదంగా మారిన ఎన్నెస్పి కాలువల ఆక్రమణ ఖమ్మం నగరంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. నగరం మధ్యలో ఎన్నెస్పి కాలువ ఉండడం, అతి ఖరీదైన భూములు కావడంతో ఆక్రమణదారులు కాలువలపై నిర్మాణాలను చేపడుతున్నారు. ఖమ్మం నగరంలోని మమత రోడ్డు సమీపంలోని గొల్లగూడెం ఎన్నెస్పి కెనల్ గతంలో ఆక్రమణలకు గురికాగా 66 అడుగుల వెడల్పున ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్‌ను కాదని సైతం కొందరు అక్రమించుకున్న విషయం విధితమే. స్థానిక నాయకులు పైరవీకారులుగా మారి స్థలాలను అక్రమించడం, అధికారులను బెదిరించిన సంఘటనలు ఉన్నాయి. ఈ వివాదాలు ఇలా కొనాసాగుతుండగానే మమత గొల్లగూడెం రోడ్డులో మమత ఆసుపత్రి గేటుకు ఎదురుగా ఓ వ్యక్తి కాలువలను పూర్తిగా అక్రమించి భవన నిర్మాణం చేపట్టాడు. అధికార యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికే బేస్‌మట్టం లేపి ఫిల్లర్స్ వేశాడు. ఇదే విషయాన్ని స్థానికులు కొందరు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా మంత్రి తుమ్మల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న కార్పోరేషన్ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి అధికారులు తీసుకోకపోవడం వెనక పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. అధికారులను తప్పుదారి పట్టించే పైరవీకారులు ఈ విషయంలో కూడా జోక్యం చేసుకున్నారా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కార్పోరేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువ భూములను పరిరక్షించాలని, అక్రమ నిర్మాణాలకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీగా మార్చాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ ఫ్రీగా తీర్చిదిద్దాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని 18వ డివిజన్‌లో రూ. 1.45 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని అభివృద్ధికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. నగరంలో చేపడుతున్న అభివృద్ధి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా, పది కాలాల పాటు నాణ్యతతో ఉండేలా చేపట్టాలన్నారు. ఖమ్మంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఖమ్మం నగరాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేలా చూడగలమన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ప్లాస్టిక్ ఫ్రీగా ఖమ్మం నగరాన్ని తీర్చి దిద్దాలన్నారు. ప్లాస్టిక్ కంపెనీలను మూసివేస్తే తప్ప కాలుష్యాన్ని నివారించలేమన్నారు. యూరియా వాడకం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఖమ్మం నగర అభివృద్ధికి వందల కోట్ల నిధులను ఖర్చు చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. మురికి కాలువల పక్కన నివాసం ఉండే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ మందడపు లక్ష్మి మనోహర్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

**18 ఎంపీటీసీలు, 7 క్లస్టర్లు ఏర్పాట్లు**




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల ప్రాథేశిక నియోజకవర్గం, మరియు జడ్పీటీసీ ఎన్నికల కు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. బుధవారం తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల కార్యక్రమం కు సిద్ధం చేసినట్లు తెలిపారు. 18 ఎంపీటీసీ లకు గాను, 6 క్లస్టర్లు...జడ్పీటీసీ మరో ప్రత్యేక క్లస్టర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేలకొండపల్లి క్లస్టర్స్1 లో నేలకొండపల్లిఎంపీటీసీ 1, 2, 3 స్థానాలకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయం లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. గువ్వలగూడెం, నాచేపల్లి, ముజ్జుగూడెం ఎంపీటీసీ స్థానాలకు ఎంపీడీవో క్లస్టర్స్ లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పైనంపల్లి, బైరవునిపల్లి, మంగాపురంతండా ఎంపీటీసీ లకు ఎంపీడీవో క్లస్టర్స్, చెరువుమాధారం, రాయగూడెం, అప్పలనరసింహాపురం ఎంపీటీసీ స్థానాలకు స్త్రీ శక్తి భవన్ క్లస్టర్1 లో, మోటాపురం, రాజేశ్వరపురం, కోరట్లగూడెం ఎంపీటీసీ స్థానాలకు స్త్రీ శక్తి భవన్ క్లస్టర్2 లో నామినేషన్ అందించాలని కోరారు. అదే విధంగా జడ్పీటీసీ ఎంపీడీఓ కార్యాలయం 7 వ క్లస్టర్స్ లో నామినేషన్ లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతీ క్లస్టర్ కు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్స్ రిటర్నింగ్‌అధికారి, ఒక కంప్యూటర్ ఆపరేటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ కు అందరూ సహకరించాలని కోరారు.

# జన్నారంలో మట్టి మాఫియా..!



**(మొదటిపేజీ తరువాయి)**

ఇప్పుడు ఆ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ సోమవారం నుంచి మూడు రోజుల పాటు రాత్రి వేళల్లో పెద్ద సంఖ్యలో వాహనాలతో మట్టిని తరలించారు. ఏన్కూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి మట్టి డాన్‌గా అవతారం ఎత్తి అధికారులను తన గుప్పెట్లో పెట్టుకుని మట్టి తరలింపు చేపడుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఇంత వరకు రెవెన్యూ అధికారులు కానీ, పోలీసులు కానీ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. రెవెన్యూ అధికారులు సన్నాయి నొక్కులు నొక్కుతూ మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామంటూ వాళ్ల వీళ్ల ముందు నోటి మాటలు చెబుతున్నారు తప్ప ఇంత వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. అనుమతులు లేకుండా మట్టిని తరలించే వాహనాలపై చర్యలు తీసుకోలేదు. అధికార యంత్రాంగం ఈ మట్టి మాఫియాకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దతు పలుకుతుందన్న ఆరోపణలు మండలంలో వినవస్తున్నాయి. ఒక వ్యక్తి మొత్తం అధికార యంత్రాంగాన్ని గుప్పెట్లో పెట్టుకోవడం, అనుమతి లేని ప్రాంతాల నుంచి మట్టిని తరలించడం ఇప్పుడు చర్చగా మారింది. జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులు ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జిల్లా టిడిపి నేతలతో చంద్రబాబు భేటీ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పరిస్థితిని, జిల్లాలోని రాజకీయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చంద్రబాబు నాయకులకు పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామంలోనూ టిడిపి జెండా ఎగిరేవిధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పని చేయాలన్నారు. ఖమ్మంజిల్లా నాయకుడు వనమా వాసు చేపడుతున్న కార్యక్రమాలను తెలుసుకుని చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబుతో భేటీ అయిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# ఎస్‌బిఐటిలో ఉత్సాహంగా కల్చరల్ వేడుకలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్వర్ణ భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్‌బిఐటి) అటానమస్ కళాశాలలో ఓటిటి ప్లాట్ఫామ్ ఆహా ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు ఇండియన్ ఐడల్ కార్యక్రమంలో పోటీ పడుతున్న గాయకులు అద్భుత మైన సంగీత ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమం కళాశాల విద్యార్థులందరికీ ఉత్సాహభరితమైన అనుభూతిని కలిగించిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు తమ కఠినమైన అకాడమిక్స్ నుండి రిలాక్స్ అవడానికి చాలా ఉపయోగపడతాయన్నారు. ఎస్‌బిఐటి కళాశాల విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో కూడా చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహిస్తామన్నారు. ఇది వారిలో ఆత్మ విశ్వాసం, సృజనాత్మకత, పరిపక్వతను పెంపొందిస్తుందన్నారు. కళాశాల విద్యార్థులు ఉత్తేజభరిత కార్యక్రమాన్ని నిర్వహించినందుకు కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు, హెచ్‌వోడిలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిలిజెన్స్ ఏఎస్ఐగా గింజల సురేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండల పరిధిలోని పొన్నెకల్లు గ్రామానికి చెందిన గింజల సురేందర్‌రెడ్డి ఇంటిలిజెన్స్ ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. గత 36 సంవత్సరాలుగా పోలీసు విభాగంలో పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన సురేందర్‌రెడ్డిని ఇల్లందు నియోజకవర్గ ఎంఎల్ఏ కోరం కనకయ్య, రైతు కమిషన్ సభ్యులు రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి, మండల నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి




## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ మధిర :** స్థానిక సంస్థల జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం మధిర మండల కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు మండలాలకు( మధిర, ఎర్రుపాలెం, బోనకల్) సంబంధించిన ఎంపిటిసి జెడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించి కౌంటింగ్ కేంద్రం వద్ద తీసుకోవాల్సిన తగు చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక రిక్రియేషన్ క్లబ్‌లో ప్రిసైడింగ్ అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో తొలి విడత శిక్షణ కార్యక్రమంలో పాల్గొని శిక్షణ పొందుతున్న అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణకు హాజరు కాని సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మధిర మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు పోలింగ్ బూతుల వారీగా సమీక్షలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టరర్ శ్రీజ, అదనపు పోలీస్ కమీషనర్ ప్రసాదరావు, డిఆర్‌డిఎ పిడి సన్యాసయ్య, ఆర్‌డిఓ నర్సింహారావు, మధిర తహశీల్దార్ రాళ్లబండి రాంబాబు, రూరల్ సిఐ మధు, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమీషనర్ అరిగెల సంపత్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# నాణ్యమైన పెట్రోల్ అందించడమే పోలీస్ పెట్రోల్ బంక్ లక్ష్యం




## పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన సిపి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు ఏసిన పెట్రోల్ బంక్ లో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే లక్ష్యం అని పోలీస్ కమీషనర్ సునీల్ దత్ అన్నారు. మండల కేంద్రం కొణిజర్ల పోలీస్ స్టేషన్ ప్రక్కన ఏర్పాటుచేసిన హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంక్ ను సునీల్‌దత్ బుధవారం ప్రారంబించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పెట్రోల్ బంక్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడం వలన బంక్‌కు మంచి గుర్తింపు వస్తుందని ఆయన ఆకాంక్షించారు. హెచ్‌పిపే యాప్ ద్వారా నగదు చెల్లింపులు జరిపితే డిస్కౌంట్ సౌకర్యం కూడా ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు పోలీస్ పెట్రోల్ బంక్ ను సందర్శించి పోలీస్ సంక్షేమానికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అడిషినల్ డీసీపి అడ్మిన్ రామానుజం, ఎస్‌బి ఏసీపి మహేష్, ఏఆర్ ఏసీపిలు నర్సయ్య, సుశీల్‌సింగ్, నఫ్సాద్, టిఎస్ (వరంగల్ టిఓ హెచ్‌పిసిఎల్ చీఫ్ రీజినల్ మేనేజర్) సమ్మయ్య, సేల్స్ ఆఫీసర్ సంకేత్, ఇంజనీరింగ్ ఆఫీసర్ బి రాహుల్, వైరా సిఐ సాగర్, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ సాంబశివరావు, నాగుల్‌మీరా, కొణిజర్ల ఎస్సై జి సూరజ్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఎన్నికల విధులను నిర్వహించాలి



## -శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల విధులను పారదర్శకంగా నిర్వహించాలని, జిల్లా సహకార అధికారి, ఎన్నికల వ్యయ నోడల్ అధికారి గంగాధర్ తెలిపారు. బుధవారం డిపిఆర్‌సి భవనంలో జోనల్ అధికారులు, అకౌంటింగ్ బృందాలు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వివిసి బృందాలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎన్నికల వ్యయ నోడల్ అధికారి గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో సర్వే లెన్స్, వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటు చేశామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు, అక్రమ నగదు, బంగారం, ఇతర ముఖ్యమైన ఆభరణాలు, ఉచితాల పంపిణీని అరికట్టేందుకు ఈ బృందాలు కట్టుదిట్టంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమన్నారు. ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన తగు చర్యలు తీసుకోవాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఎన్నికల వ్యయ వివరాల నమోదు ఒక అంశమైతే, ఎన్నికల నోటిఫికేషన్ నుంచి కౌంటింగ్ ముగిసే వరకు మరో ఎత్తుగా ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వహించాలన్నారు. శిక్షణలో జిల్లా ఆడిట్ అధికారి భూక్యా హుస్సేన్ నాయక్, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు, నిఘా బృందాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మొదటి విడతలోనే సర్పంచ్ ఎన్నికలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం మండలంలో మొదటి విడతలోనే గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు రఘునాథపాలెం మండలంలో రెండవ విడతలో, గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు మూడవ విడతలో ఎన్నికలు జరుగుతాయని అధికారులు తొలుత ప్రకటించారు. ఇప్పుడు ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు రెండవ విడతలోనే మండలంలో జరగనుండగా సర్పంచ్ ఎన్నికలు మాత్రం మూడవ విడత నుంచి మొదటి విడతకు వచ్చింది. ఈ మేరకు అధికారులు ప్రకటించారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానానికి, 308 వార్డులకు మొదటి విడతలోనే ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి ఈనెల 17 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. అక్టోబర్ 31న ఎన్నికలు జరగనున్నాయి. మూడవ విడత నుంచి మొదటి విడతలోకి సర్పంచ్ ఎన్నికలు మార్చడంపై గ్రామంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై గ్రామాల్లో సందడి నెలకొంది. ఎంపిటిసి, జెడ్పిటిసి, సర్పంచ్ స్థానాలకు రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. జెడ్పిటిసి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు పోటీ పడుతుండగా బిఆర్ఎస్ నుంచి కూడా ముగ్గురు పోటీ పడుతున్నారు.

# తాళ్లూరి పల్లవిని అభినందించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఖమ్మం జిల్లాకు చెందిన తాళ్లూరి పల్లవిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో ఆలిండియా ట్రెడ్ టాపర్‌గా తాళ్లూరి పల్లవి నిలిచింది. ఈ సందర్భంగా వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తాళ్లూరి పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులు మర్యాద పూర్వకంగా కలిశారు. పల్లవిని శాలువతో సత్కరించి మెమోంటోను బహూకరించారు. ఈ సందర్భంగా అర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగంలో దేశంలోనే టాపర్‌గా నిలవడం ఎంతో అభినందనీయమన్నారు. పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులను మంత్రి తుమ్మల అభినందించారు. పల్లవిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు బాగా చదవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమ్మ మహాజన సంఘ ఖమ్మం బాధ్యులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము, రావూరి సైదుబాబు, నల్లమల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పరుచూరి రాధమ్మకు సిపిఐ నేతల నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సిపిఐ నాయకురాలు పరుచూరి రాధమ్మకు సిపిఐ నేతలు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఖమ్మంలో జరిగిన రాధమ్మ సంస్మరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరుచూరి రాధమ్మ కుటుంబం కమ్యూనిస్టు పార్టీలో అనేక త్యాగాలను చేసిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. జంట హత్యలు జరిగిన అదరక, బెదరక తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన ధీరోదాత్త కుటుంబమన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, సిపిఐ నాయకులు పుచ్చకాయల సుధాకర్, శాఖమూరి శ్రీనివాసరావు, తాటి నిర్మల, వెంకటాయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ రావెళ్ల మాధవి, నాయకులు రావెళ్ల వాసు, కృష్ణమోహన్, షర్మిల, నంబూరి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# బస్‌స్టాప్ పర్ణశాల వద్దకు తరలింపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ వద్ద గల బస్‌స్టాప్‌ను పక్కనే గల రామాలయం పర్ణశాల వద్దకు తరలిస్తున్నట్లు ఖమ్మం ఆర్టిసి డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ట్రాఫిక్ సిఐ నాయుడు తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఖమ్మం ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు సూచనల మేరకు బస్‌స్టాప్‌ను పర్ణశాల వద్దకు తరలిస్తున్నట్లు వారు తెలిపారు. బుధవారం డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్, ట్రాఫిక్ సిఐ నాయుడు పర్ణశాల వద్ద బస్‌స్టాప్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య మాట్లాడుతూ వైరా, తల్లాడ, భద్రాచలం, సత్తుపల్లి వెళ్లే మార్గమైన మమత రోడ్డు దగ్గర ఉన్న ఇందిరా నగర్ వద్ద గల బస్‌స్టాప్ వద్దే ట్రాఫిక్ సిగ్నల్ కూడా ఉండడంతో అటు ప్రయాణికులకు, ఇటు వాహన దారులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఇందిరానగర్ బస్‌స్టాప్‌కు కొంచెం ముందు ఉన్న రామాలయం పర్ణశాల వద్దకు మార్చనున్నట్లు వారు తెలిపారు. నేటి నుంచి బసులన్ని పర్ణశాల వద్ద ఆగుతాయని ప్రయాణికులు సహకరించాలని వారు కోరారు.

# బిజెపి అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిజెపి అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్ల చోరీపై సంతకాల సేకరణ చేపట్టాలని ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఖమ్మం నగరంలోని డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జావిద్ మాట్లాడుతూ ఓట్ చోర్ గద్దె చోర్ ఉద్యమ పిలుపులో భాగంగా ఏఐసిసి ఆదేశానుసారం టిపిసిసి సూచనల మేరకు ప్రతి డివిజన్ నుంచి 100 సంతకాలను సేకరించాలన్నారు. ఒక వ్యక్తికి ఒక ఓటు అనేది రాజ్యాంగానికి మూల స్తంభమన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘం బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. బిహార్‌లో ఓటర్ జాబితాలో జరిగిన అవకతవకలను ప్రజలకు వివరించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి , సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రబాని, గౌస్, అబ్బాస్, యశ్వంత్, రమేష్, శ్రీనివాస్, కనకరాజు, పూర్ణచంద్, మహమూద్, వెంకటయ్య, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టిని కలిసిన ఎంఎల్ఏ కోరం




ప్రజాపక్షం/ఇల్లందు: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఇదే కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో కలిసి ఇల్లందు నియోజక వర్గం స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితులపై ఉప ముఖ్యమంత్రితో ఎంఎల్ఏ చర్చించారు. వారి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ బోగాళ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గణేష్, సర్దార్, కంట్రాక్టర్ రాము, తదితరులు ఉన్నారు.

## ఇసుక ర్యాంపులతో అవస్థలు




ప్రజాపక్షం/మణుగూరు: ఇసుక ర్యాంప్‌లతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అతి చిన్న మారుమూల అతి చిన్న రోడ్డుపై వందల లారీలతో ఇసుక తరలిస్తున్నారు. సిఐ సాక్షిగా 15 రోజులు ఒప్పందం చేయగా.. నెల రోజులు పూర్తయినా పోలీస్‌లు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల బాధలు, గ్రామాల ప్రజల ఆవేదన పట్టించుకునే అధికారి కరువయ్యాడు. అంబులెన్స్, స్కూల్ వ్యాన్, బడి బస్సు, ఆఖరికి కనీసం బైక్ పోవడానికి కూడా సందులేని పరిస్థితి నెలకొంది. విసుగు చెందిన గ్రామాల ప్రజలు లారీలను నిలుపుదల చేస్తే తక్షణమే పోలీస్‌లు ప్రత్యక్షమై ఇసుక లారీలను సాగనంపుతున్నారు. మరి ప్రజలకు ఇబ్బంది అయితే ఏ శాఖ అధికారి వస్తారు. జిల్లా కలెక్టర్, పోలీస్ శాఖ, మైనింగ్ శాఖ, అధికారులు ప్రజల బాధను పట్టించుకోరా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రస్థాయి షాట్ పుట్‌కు కత్రి దాసు ఎంపిక



ప్రజాపక్షం/ములకలపల్లి: కొత్తగూడెం ప్రకాశం స్టేడియం ప్రాంగణంలో జరుగుతున్న 69 వ ఎస్‌జీఎఫ్ పాఠశాలల క్రీడా అంశాలలో ఎన్ జగన్నాథపురం విద్యార్థి కత్రి దాసు పదవ తరగతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థి అండర్ 17 క్రీడా అంశాలలో షాట్ పుట్, డిస్కస్ త్రో ఈవెంట్లలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ప్రముఖులు విద్యార్థి దాసుకు అభినందనలు తెలిపారు.

## పిడుగుపాటుకు పూరిల్లు దగ్ధం



ప్రజాపక్షం/ములకలపల్లి: మండల పరిధిలో బుధవారం సాయంత్రం ఉరుముల మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీ వర్షం సమయంలో మూకమామిడి గ్రామంలో కుప్పాల ముల కేశవరావు పూరి ఇంటిపైన పిడుగు పడటంతో పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. పిడుగు పడిన సమమంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

## 12న నవోదయ మోడల్ పరీక్ష

ప్రజాపక్షం/బూర్గంపాడు: బ్రిలియంట్ నవోదయ కోచింగ్ సారపాక వారి ఆధ్వర్యంలో 202526 సంవత్సరానికి జరగబోయే నవోదయ మెయిన్ పరీక్ష వ్రాయబోయే విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించేందుకు ఈ నవోదయ మోడల్ పరీక్షను భద్రాచలం బస్టాండ్ వెనుక సిద్ధార్థ ఒకేషనల్ కాలేజ్ నందు ఈనెల 12వ తేదీ ఆదివారం ఉదయం 9:30నిముషాలకు నిర్వహిస్తున్నట్లు బ్రిలియంట్ నవోదయ కోచింగ్ ఛైర్మన్ డాక్టర్ బిఎన్ ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. మెంటల్ ఎబిలిటీ, మాథ్స్, లాంగ్వేజెస్‌పై ఈ మోడల్ పరీక్ష ఉంటుందన్నారు. నవోదయ స్కూల్‌కి అప్లై చేసుకున్న తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ మోడల్ పరీక్షలో మొదటి మూడు ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు కోచింగ్ ఉచితంగా ఇవ్వబడుతుందన్నారు. నవోదయ మోడల్ పరీక్ష రాయబోవు విద్యార్థులు ఒక్క రోజు ముందుగా తమ పేర్లను బ్రిలియంట్ స్కూల్ నందు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకై 9866283566, 7675040619ను సంప్రదించాలన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై సన్నద్ధంగా ఉండాలి



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ శ్రేణులు సన్నద్ధంగా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు సూచించారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని తనగంపాడులో ఎన్నికలపై కార్యశాలను జాటోత్ మధు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు రవి రాథోడ్, నకిరికంటి వీరభద్రం, పాలేరు నాయకులు నున్నా రవికుమార్, నల్లగుట్ట ప్రవీణ్, శ్రీను, సోనుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆ గట్టునుంటువా.. ఈ గట్టునుంటావా..!

- ఓటర్లను ఆకర్షించే పనిలో రాజకీయ నాయకులు
- గ్రామాల్లో పెరిగిన రాజకీయ సందడి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి తారస్థాయికి చేరింది. మొత్తం మండల వ్యాప్తంగా 40 గ్రామపంచాయతీల ఉండగా జెడ్పిటిసి ఎస్టీ మహిళలకు కేటాయించగా ఎంపిపి స్థానం ఎస్సీ మహిళకు కేటాయింస్తున్నట్లు ఇటీవల ఎన్నికల కమీషన్ విడుదల చేయగా గ్రామంలో రాజకీయ చర్చ తారస్థాయికి చేరింది. తిరుమలాయపాలెం మండలంలో ఎక్కువ శాతం బిసి ఓటర్లు ఉండగా అందరూ జనరల్ కాని బిసిగానే అవుతుందని భావించినప్పటికీ జెడ్పిటిసి ఎస్టీ మహిళ, ఎంపిపి ఎస్సీ మహిళ కావడంతో ప్రధానంగా కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ నుండి అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో మండలస్థాయి నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇప్పటికే స్థానిక మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండల వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులను కమిటీలుగా విభజించి మండల ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఓ పథకం రచించినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుని కాంగ్రెస్‌లో ఎక్కువ ప్రజాదరణ ఉన్న అభ్యర్థిని ఎంపిక చేసి బీఫామ్ ఇచ్చే విధంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. బిఆర్ఎస్‌లోని సైతం పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు తాత మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షులు భాషబోయిన వీరన్న ఇప్పటికే తమ అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యారు. ఇందతా ఇలా ఉండగా మొదటి నుండి పోటీకి సిద్ధమైన వారు ఓటర్లను ఆకర్షించే పనిలో ఉన్నారు. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీలో ఉన్న ఓటర్లు తమ ఓటమికిని గెలుపుగా మార్చగలిగే శక్తి వారికి ఉందని పోటీదారులు కమ్యూనిస్టు పార్టీ నాయకులతో సన్నిహితంగా ఉంటూ ప్రజలను ఆకర్షించే పనిలో పడ్డారు. గ్రామంలో ఈ సందడి చూస్తుంటే సుకుమార్ డైరెక్టర్ తీసిన సినిమా రంగస్థలం గుర్తుకొస్తుంది. ఆ గట్టునుంటావా ఈ గట్టునుంటువా ఏ గట్టున ఉన్న ఓటు మాకే వేయండి అన్న డైలాగ్ గుర్తు చేసుకుంటున్నారు. బిసి రిజర్వేషన్‌పై హైకోర్టు తీర్పు వాయిదా వేయడంతో నాయకుల్లో ఆందోళన మొదలైంది. హైకోర్టు తీర్పు తర్వాత ఒక క్లారిటీ రానుంది. మొత్తానికి గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొన్నది.

# ప్రభుత్వానికి భారీగా గండి కొడుతున్న నకిలీ డీడీలు

ప్రజాపక్షం/మణుగూరు: పినపాక నియోజకవర్గం లో నకిడిలతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని ఆరోపణలు వెలివెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణా నిరంతరం కొనసాగుతోంది. మైనింగ్, శాఖల పర్యవేక్షణ లోపం కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన కోట్లా రూపాయల ఆదాయం పడిపోతుంది. నకిలీ డిమాండ్ డ్రాఫ్టలు (డీడీలు) ఉపయోగించి అక్రమార్కులు యధేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు.

### ఈ నకిలీ దందా ఎలా జరుగుతుంది..?

ఇసుక రవాణాకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం, మైనింగ్ శాఖ నిర్దేశించిన ప్రాంతాల నుండి మాత్రమే ఇసుకను తీయాలి. లారీల ద్వారా రవాణా చేయడానికి ముందు, రవాణా రుసుము, ఇతర పన్నుల కోసం డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) చెల్లించాలి. ఈ డీడీలను సంబంధిత బ్యాంకుల నుండి పొందాలి, వాటిని మైనింగ్ అధికారులకు సమర్పించిన తర్వాత రవాణాకు అనుమతి లభిస్తుంది. అయితే పినపాక నియోజకవర్గంలో అక్రమార్కులు నకిలీ డీడీలను తయారు చేసి, వాటిని వందల లారీలకు అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ డీడీలు సులభంగా తయారు చేయగలిగేలా ఉంటాయి, అసలు డీడీలకు, నకిలీ డీడీలకు మధ్య తేడాను గుర్తించడం అధికారులకు చాలా కష్టం. ఈ నకిలీ డీడీల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సున్నాగా మారుతోంది.

### అధికారుల పాత్రపై సందేహాలు...

నకిలీ డీడీలతో వందల లారీలలో ఇసుక తరలిస్తున్నా మైనింగ్, తదుపరి శాఖల అధికారులు నిఘా పెట్టడం లేదు. అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ప్రజలకు ఈ నకిలీ డీడీల గురించి తెలుస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దృష్టి పెట్టి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అక్రమాలకు ఇసుక ఆదాయం ముతాను పట్టుకుంటే ప్రభుత్వానికి రావడమే కాకుండా అక్రమ రవాణా కూడా చాలా వరకు అదుపులోకి వస్తుందని ప్రజలు అంటున్నారు. ఈ ఆరోపణ నిజం చేస్తూ బుధవారం రోజున నాలుగు లారీలు నకిడిటీలతో ఇసుకన రవాణా చేస్తుండగా ఒక లారీని అశ్వాపురం పోలీసులు పట్టుకున్నట్టుగా సమాచారం. మిగిలిన మూడు లారీలు అతివేగంగా కొత్తగూడెం వైపు వెళ్ళినట్టుగా తెలుస్తుంది. ప్రభుత్వం దృష్టి పెట్టి, తనిఖీలను పెంచడం, అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి అక్రమాల వల్ల రాష్ట్ర ఆదాయం పడిపోవడమే కాకుండా, పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో నకిలీ డిడి దందా జోరుగా సాగుతుందని ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

# వైరాలో ఆగని రేషన్ బియ్యం దందా..!

- -పెరుగుతున్న అక్రమార్కుల ఆగడాలు
- -రేషన్ షాపులు వద్ద కొనుగోలు చేస్తున్న దళారులు
- -రేషన్ డీలర్లపై చర్యలు తీసుకుంటేనే దందాకు తెర





ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం దందా కొనసాగుతూ ఉంది. ఈ రేషన్ బియ్యం దందాను రేషన్ షాపులు వద్ద నుండే కొనసాగించడం కొసమెరుపు. రేషన్ బియ్యం ఇస్తున్నారని విషయం తెలియగానే నేరుగా కొంతమంది దళారులు రేషన్ షాపులు వద్దకి వెళ్లి అక్కడే ఎలాంటి భయం లేకుండా ఆటోలు, స్కూటీలు టివిఎస్‌లపై తరలిస్తూ ఒకచోట నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రేషన్ షాపుల డీలర్లపై ముఖ్యంగా కఠినమైన చర్యలు తీసుకొని ఆంక్షలు విధిస్తే రేషన్ బియ్యం అక్రమ దందాకు తెర దించవచ్చు. వైరాలో పెద్ద ఎత్తున ఈ దందా కొనసాగుతూ ఉంది. రేషన్ షాపులు మందు ఎలాంటి భయం లేకుండా నేరుగా రేషన్ బియ్యాన్ని తీసుకుపోయి నిల్వ చేసి అమ్ముతున్నారు. కొంతమంది ఇంట్లో నిల్వ ఉంచి గత మూడు నెలలుగా మేము తెచ్చుకున్న బియ్యమని చెబుతూ తప్పుడు కథనాలు అధికారులు వినిపిస్తున్నారు. ఒక్కసారి అధికారులు పూర్తిస్థాయిలో దొరికిన వ్యక్తుల చరిత్ర గురించి ఆలోచించి వివరాలు తెలుసుకుంటే వారి వృత్తి మొత్తం అక్రమ దందా వ్యాపారం అనే కొనసాగుతుందని చెప్పవచ్చును. వైరా మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ఈ దందా కొనసాగుతుంది. రెవెన్యూ అధికారులు ముఖ్యంగా రేషన్ షాపులు డీలర్లపై సమావేశాలు పెట్టి కఠిన ఆంక్షలు విధిస్తే రేషన్ దందాకు ముగింపు పలకవచ్చు. కొంతమంది రేషన్ దందా చేస్తున్న వారు మాకు అధికారులు అండదండలు ఉన్నాయి. మమ్మల్ని ఎవరు ఏమి చేయలేదు. మేము చెప్పిందే వేదం. మేము ఎవరికి భయపడమని అధికారులపై తప్పుడు ఆర్పోణలు చేయడంతో పాటు అధికారులపై పలురకాల నిందలు కూడా వేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా రేషన్ షాపుల వద్ద కట్టడి చేస్తేనే అక్రమ బియ్యం వ్యాపారానికి అడ్డుకట్ట పడిద్దని పలువురు ఆరోపించారు.

### వైరాలో పట్టుబడ్డ రేషన్ బియ్యం...

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో రేచర్ల వెంకటేశ్వర్లు తండ్రి(లేటు) లక్ష్మీనారాయణ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 3 క్వింటాళ్ల 30 కేజీల బియ్యాన్ని రెవన్యూ అధికారులు పట్టుకున్నారు. అదేవిధంగా వైరాలో కూరగాయల మార్కెట్ రోడ్డులో టివిఎస్ మీద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని గత కొంతకాలంగా వీరు రేషన్ షాపుల వద్ద నేరుగా కొనుగోలు చేస్తూ అక్రమ బియ్యం వ్యాపారానికి పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

# అభ్యర్థుల కోసం అన్వేషణ..!

- -రంగంలోని వివిధ శాఖల అధికారుల రహస్య సర్వే
- -గెలుపు గుర్రాల కే టిక్కెట్ల కేటాయింపు లక్ష్యం






ప్రజాపక్షం/నేలకొండపల్లి : స్థానిక ఎన్నికలలో గెలుపు లక్ష్యంగా రాజకీయ పార్టీలు అడుగులు వేస్తున్నారు. అందుకు బలమైన అభ్యర్థులను నిలబెట్టటానికి హ్యహారచన చేస్తున్నాయి. మెజార్టీ స్థానాలను సాధించటానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఖరారైన రిజర్వేషన్ల పై పార్టీలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చాయి. ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులుగా పోటీ చేయటానికి చాలా మంది ఆశవాహులు ఉత్సాహం చూపుతున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీ చేయాలనుకునే వారి పేర్ల ను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజెపీ సేకరిస్తున్నాయి. అన్ని పార్టీల హైకోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. గురువారం మధ్యాహ్నం వరకు నరాలు తెగే ఉత్కంఠత నెలకొంది. న్యాయస్థానం ఇచ్చే తీర్పు ఆధారంగా ముందుకు వెళ్లాలని భావిస్తున్నాయి.

### కాంగ్రెస్ లో అభ్యర్థుల వడపోత....

స్థానిక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ పార్టీ అచితూచి అడుగులు వేస్తుంది. పాలేరు నియోజకవర్గంలో రాష్ట్ర రెవిన్యూ ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. తొలుత పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేశారు. ఆ కమిటి స్థానికంగా ప్రత్యేక సమావేశం ను ఏర్పాటు చేసి అభ్యర్థుల పేర్లు ను సేకరిస్తుంది. ఈ పేర్లలో అభ్యర్థుల ఎవరైతే గెలుస్తారు...ఎవరిని ఎంపిక చేయాలనే విషయం లో కీలకంగా లోతుగా ఆరా తీస్తుంది. ఇందు కోసం వివిధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయి లో సర్వే చేసి మంత్రి కి అందించినట్లు సమాచారం. కాగా ప్రవేట్ నిపుణులతో కూడ రహస్య సర్వే చేయించినట్లు తెలుస్తుంది. పాలేరు లో అభ్యర్థులు మొత్తం విజయం సాధించేందుకు ముందుగానే అభ్యర్థుల వద్దనే తెలాలని తగిన చర్యలు తీసుకుంటున్నారు. వివిధ శాఖల అధికారులు...ప్రవేట్ సర్వేలు ఇచ్చిన నివేదిక ఆధారంగా మంత్రి శ్రీనివాసరెడ్డి టిక్కెట్లు ఇవ్వనున్నట్లు తెలుస్తుంది.

### బీఆర్ఎస్..బీజెపీలు అభ్యర్థులు ఖరారు....

పాలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజెపీ లు ఇప్పటికే అభ్యర్థుల ను ఖరారు చేసినట్లు తెలుస్తుంది. స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని...కాంగ్రెస్ ను డీకొనాలని బీఆర్ఎస్ అభ్యర్థులను సిద్ధం చేసిఉంచారు. రిజర్వేషన్ల ప్రకారం బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తున్నారు. కోర్టు తీర్పు తరువాత అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నట్లు నాయకులు పేర్కొంటున్నారు. బీజెపీ మండల కమిటిలు ఎంపీటీసీ, సర్పంచ్‌లు జాబితా రెడీగా ఉన్నట్లు సమాచారం. బూత్ స్థాయి నుంచి కార్యకర్తల వరకు అందరిని సంప్రందించిన తరువతే అభ్యర్థికి భీ ఫాం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పార్టీ నాయకుడు ఒకరు చెప్పారు.

### సోషల్ మీడియా వేదిక గా ప్రచార జోరు....

జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఆశావహాలు సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తాము పోటీ చేస్తున్నామని...మీ దీవెనలు కావాలని....తనను గెలిపిస్తే ఈ అభివృద్ధి పనులు చేస్తామని వాట్సాప్ ద్వారా ప్రకటిస్తున్నారు. దీంతో ప్రత్యర్థి వర్గం కూడా పోటా పోటీగా గ్రూపులలో పోస్టు చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో వార్ ను తలపించే విధంగా పోస్టులు పెడుతున్నారు. పాలేరు లో ఎక్కువగా యువత పోటీలో ఉండేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తుంది. హైకోర్టు తీర్పు ను బట్టి మరింత మంది ప్రముఖలు బరిలో నిలవాలని యోచిస్తుండటంతో ప్రధాన పార్టీలు నడుమ రసవత్తర పోటీ అనివార్యమని సోషల్ మీడియా వేదిక గా ప్రచారం జరుగుతుంది. మొత్తం మీద స్థానిక పోరుకు పల్లెలు సై అంటున్నాయి.

# సింగరేణి మండలంలో చలామణి అవుతున్న నకిలీ బంగారం..!

- -నకిలీ బంగారం చలామణిలో కీలకంగా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్ నేత
- -బంగారం పూతకు డిమాండ్ ఎక్కువ

ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి మండల కేంద్రంలో గత ఆరు నెలల నుండి దొంగ బంగారం తయారు చేసే మూఠ ప్రభుత్వ బ్యాంకులను కొంత మంది ప్రైవేట్ వ్యక్తులను ఎంచుకొని బంగారం తనకా పెట్టాలని చెప్పి వారు అడిగిన డబ్బులకు ఎక్కువ వడ్డీ ఇస్తామని ఆశ చూసి బంగారం తనక పెడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వడ్డీ వ్యాపారులు ఇదే అదును అనుకొని బంగారం పెట్టుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో దొంగ బంగారం చలామణిలో కీలకంగా బిఆర్ఎస్ పార్టీ నేత వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక ప్రభుత్వ బ్యాంక్‌లో లక్ష ఇరవై వేలకు రెండు గాజులు పెట్టారని, రెండు రోజుల తర్వాతపై అధికారులు ప్రతి నెల సాధారణమైన తనిఖీల కోసం వచ్చిన తరుణంలో దొంగ బంగారం బయటపడిందని సదరు వ్యక్తిని బ్యాంక్ అధికారి పిలిచి విచారణ చేయగా నేను నిజమైన బంగారం పెట్టానని, మీరు కావాలని నా మీద అబండం వేస్తున్నారని చెప్పడంతో సంబంధించిన బ్యాంక్ అధికారం కంగుతిన్నాడు. అధికారి గట్టిగా నిలదీయగా నిజం ఒప్పుకోగా, బయట చెప్పితే ఎవరికైనా నేను నా కుటుంబ అందరం కలిసి వచ్చి నీ బ్యాంకు ముందు మందు తాగుతామని బెదిరించగా సంబంధించిన అధికారి రెండు వాయిదాల పద్ధతిలో డబ్బులు కట్టాలని ఒప్పందం కుదుర్చుకున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. ఇది జరిగిన కూడా ఆ బిఆర్ఎస్ నేత బ్యాంక్‌ను వదిలేసి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర దొంగ బంగారం పెట్టడం కొనసాగించాడని, ఈ మధ్యకాలంలో ఒక బంగారం వ్యాపారి దగ్గర 80వేల రూపాయలకు దొంగ బంగారం పెట్టగా రెండు రోజుల తర్వాత ఆ బంగారం వడ్డీ వ్యాపారి బ్యాంక్‌లో ఉన్న తన లాకర్‌లో భద్రపరచడానికి పోయిన సందర్భంలో సంబంధించిన బ్యాంక్ అధికారి తనిఖీ చేయగా ఇది దొంగ బంగారమని చెప్పడంతో ఆ బంగారం వడ్డీ వ్యాపారి ఖంగుతిని సంబంధించిన వ్యక్తిని పిలవగా వడ్డీ వ్యాపారిని బ్లాక్ మెయిన్ చేయడం మొదలు పెట్టాడని విశ్వసనీయ సమాచారం. దీంతో ఆ వడ్డీ వ్యాపారి అధికార పార్టీనాయకురాలి దగ్గర విషయం చెప్పగా ఆ వ్యక్తిని పిలిచి అడిగితే నేను రెండు నెలల తర్వాత ఇస్తానని ఒప్పుకొని వెళ్లిపోవడం, ఇలా చాలా మంది వ్యక్తుల దగ్గర ఆ బిఆర్ఎస్ నేత ఇదే విధంగా చెప్పుకుంటూ వెళ్లిపోతున్నాడని, అసలు ఇతన వెనుక అతిపెద్ద మూఠ ఉందని మండలంలో తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

# మద్యం షాపుల లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ జారీ

ప్రజాపక్షం/మణుగూరు: రెండు సంవత్సరాల (2025 27) కాల పరిమితికి లాటరీ ద్వారా మద్యం షాపుల లైసెన్సుల జారీకి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమీషనర్ హరికిరణ్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు మణుగూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆర్. రాజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 15 మద్యం షాపుల ఏర్పాటు ధరఖాస్తులు ఆహ్వానించ బడుతున్నాయి అన్నారు. మణుగూరు మండలంలో బందారు గూడెం6 (ఎస్టీఏజెన్సీ) గుట్టమల్లారం2 (ఎస్టీఏజెన్సీ) అశ్వాపురం మండలంలో అశ్వాపురం/గొల్లగూడెం2 (ఎస్టీఏజెన్సీ), మొండికుంట 1 (గౌడ్) పినపాక మండలంలో ఏడుళ్ల బయ్యారం2 (ఎస్టీఏజెన్సీ), జానంపేట1 (ఎస్టీఏజెన్సీ), కరకగూడెం మండలంలో కరకగూడెం1 (ఎస్టీఏజెన్సీ) షాపుల ఏర్పాటుకు గెజిట్ జారీ చేయబడినట్లు తెలిపారు. ఆసక్తి కలవారు ధరఖాస్తుతో పాటు 3 లక్షల రూపాయల డిడి లేదా చలానా, 3 కలర్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, స్వీయ ధృవీకరణ గల ఆధార్ కార్డ్ లేదా పాన్ కార్డ్ లను విధిగా జతపరచాలని తెలిపారు. డిడిలను District Prohibition and Excise Officer/Commissioner of Prohibition and Excise ల పేరు తీయాలన్నారు. ఇట్టి మద్యం షాపులకు అక్టోబర్ 18 వ తేది సాయంత్రం 5 గంటల వరకు ధరఖాస్తులు స్వీకరించబడునట్లు తెలిపారు. ఇట్టి ధరఖాస్తులు జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయం, బాబు క్యాంప్, కొత్తగూడెం, ఎక్సైజ్ కమీషనర్ వారి కార్యాలయం, అబ్కారీ భవన్, నాంపల్లి, హైదరాబాద్ నందు స్వీకరించబడునట్లు తెలిపారు. నూతన మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ అక్టోబర్ 23 న ఉదయం 11 గంటల నుండి కొత్తగూడెం క్లబ్, కొత్తగూడెం నందు జిల్లా కలెక్టర్ సమక్షంలో దరఖాస్తుల డ్రా తీయబడుతుందని, ధరఖాస్తు కు సంబందించి ఏదేని సందేహాలుంటే 8712658855ను సంప్రదించాలని సూచించారు.

## రాష్ట్ర స్థాయి అండర్ 19 కబడ్డీ పోటీలకు కూసుమంచి గురుకుల విద్యార్థి



ప్రజాపక్షం/కూసుమంచి: సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యస్‌జిఎఫ్ కబడ్డీ పోటీల్లో మహాత్మ జ్యోతిబాపూలే(ఎంజెపి) గురుకుల బాలుర విద్యాలయం కూసుమంచి విద్యార్థి ఎన్ సాయి కృష్ణ 10వ తరగతి అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఈ పోటీల్లో విజయం సాధించి, మహబూబాబాద్ ఈనెల 10,11,12 తేదీలలో జరిగే తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల అండర్ 19 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా బిసి గురుకుల ఆర్‌సిఓ సిహెచ్ రాంబాబు మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థులకు ప్రేరణాత్మకమైందని, క్రీడలలో కృషి, పట్టుదలతో రాణించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మరింత ప్రతిభ కనబరుస్తారని నమ్మకం ఉందన్నారు. కూసుమంచి జ్యోతిబాపూలే గురుకుల బాలుర విద్యాలయ ప్రిన్సిపాల్ పేరబోయిన మల్లయ్య, పీఈటీ నరసింహతో పాటు ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది అందరూ విద్యార్థి సాయి కృష్ణని అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## పాపకొల్లు ఎంపీటీసీ బరిలో కోటేశ్వరరావు



ప్రజాపక్షం/జూలూరుపాడు: స్థానిక సంస్థల పోరు జోరందుకుంది. అశావహుల జాబితా శాంతాడంత పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో జూలూరుపాడు మండలానికి చెందిన కొదుమూరి కోటేశ్వరరావు తాను సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మారిన రిజర్వేషన్ల కారణంగా జూలూరుపాడు మండలం పాపకొల్లు ఎంపీటీసీ 1కు ఓసీ వచ్చిన సంగతి విధితమే. ఈ నేపథ్యంలో జూలూరుపాడు మండలంలో పాపకొల్లు నుండి కాంగ్రెస్ పార్టీ నుండి ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొదుమూరి కోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్‌కి సన్నిహితుడిగా పేరున్న కొదుమూరి ఎంపీటీసీ బరిలో నిలుస్తుండటంతో ఈ సారి స్థానిక సంస్థల పోరు రసవత్తరంగా మారనుంది.

## ఎన్నికల అధికారులకు శిక్షణ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు శాంతినగర్‌లో ఉన్న రైతువేదిక నందు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏపివోస్, పివోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. 167 మందికి 160 మంది శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలకు అనుసరించాల్సిన విధి విధానాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సక్రియ, తహశీల్దార్ శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## సిజెఐపై దాడి చేసిన న్యాయవాదిని ఉరి తీయాలి

ప్రజాపక్షం/కారేపల్లి: సిజెఐపై దాడి చేసిన న్యాయవాదిని ఉరి తీయాలని సిపిఐ ఎంఎల్ కారేపల్లి కామేపల్లి సబ్ డివిజన్ కార్యదర్శిది భూక్య శివనాయక్ అన్నారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో గల సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం పేరుతో ఒక మతోన్మాద అడ్వకేట్ రాజేష్ కిషోర్ సుప్రీం కోర్ట్ ప్రాంగణంలోనే సిజెఐ గవామ్‌పై పాదరక్ష విసరడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం వ్యక్తిగత దాడి కాకుండా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ రాజ్యాంగ పునాదులపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్య పునాదులను కాపాడే ప్రతి భారత పౌరుడు దీనిపై స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ ఘటనపై రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, హోం శాఖ మంత్రి తక్షణమే స్పందించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు ఐక్యంగా నిలిచి ఈ కుట్రలను తిప్పి కొట్టాలని డిమాండ్ చేశారు.

## మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/కారేపల్లి: సింగరేణి ఎక్సైజ్ పరిధిలో మద్యం దుకాణాల ఏర్పాట్లు లైసెన్సుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిఐ ఎం ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కారేపల్లి మండల కేంద్రంలో 1, 2, 3 షాపులు జనరల్, 4వ షాపు ఎస్టీ, కామేపల్లి మండలంలో 3 దుకాణాలు ఎస్టీ, ఏన్కూరు మండలంలో మూడు దుకాణాలు ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించినట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 18వ తేదీ లోపు రూ 3లక్షలు డిడి లేదా చలానాలు తీసి జిల్లా కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు. ఈనెల 23న లక్కీ డ్రా తీయనున్నట్లు పేర్కొన్నారు.

## నేడే హుండీ లెక్కింపు

ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశవాపురం, జగన్నాధపురం గ్రామాల మధ్యన కొలువై ఉన్న (శ్రీకనకదుర్గ) పెద్దమ్మతల్లి దేవాలయంలో నేడు హుండీ లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీ కుమారి బుధవారం తెలిపారు. 20.05.2025 నుండి 08.10.2025 వరకు భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా సమర్పించిన కానుకలను ఆలయ ఆవరణంలో గల శ్రీ వెంకటేశ్వర ఉచిత కళ్యాణ మండపంలో లెక్కిస్తామని పేర్కొన్నారు.

# స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట బందోబస్తు

-సిసి కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ
-జిల్లాలో స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల నియమావళిని అనుసరించి స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు, పకడ్బందీ బందోబస్తు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, మధిర పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తల్లాడ మండలంలోని జ్యోతి జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూము, లెక్కింపు సెంటర్ల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి బుధవారం పరిశీలించారు. ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలకు సంబంధించిన స్ట్రాంగ్ రూము, లెక్కింపు హాల్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు కలెక్టర్ సూచించారు. మొదటి విడతలో నిర్వహించే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల లెక్కింపు హాల్స్, స్ట్రాంగ్ రూమ్స్, సిసి కెమెరాల ఏర్పాటు, రిసెప్షన్ కౌంటర్ నిర్వహణ, లెక్కింపు హాల్ లోపల జాలితో ఫెన్సింగ్, ఎన్నికల సిబ్బందికి వసతలు, బ్యాలెట్ బాక్సులు తీసుకు వచ్చే బస్సుల ట్రాఫిక్ నియంత్రణ, స్ట్రాంగ్ రూము వద్ద బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని, పోలీస్ కంట్రోల్ రూము ద్వారా నిరంతర సిసి కెమెరా పర్యవేక్షణ ఉండాలన్నారు. మీడియా సెంటర్‌తో పాటు వర్షం వల్ల ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బోనకల్, మధిర, ఎర్రుపాలెం, సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల నందు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ క్రీస్తు జ్యోతి కళాశాల నందు, తల్లాడ, కల్లూరు, ఏన్కూరు మండలాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూము, లెక్కింపు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జెడ్పి సిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, అడిషనల్ డిసిపి ప్రసాదరావు,ఖమ్మం ఆర్డివో నర్సింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు కరుణాకర్‌రెడ్డి, రాంప్రసాద్, ఎంపిడివోలు ఎ. సురేష్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు పట్టువిడుపు ఎందుకు..?

- నామినేషన్ ప్రక్రియ మొదలవుతున్న తరుణంలో పోలీసుల మౌనమేలా..!




**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో ఎట్టకేలకు సుమారు రెండు సంవత్సరాల అంనతరం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూలు తెలంగాణ ఎన్నికల కమీషన్ ప్రభుత్వం విడుదల చేయటంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఈతరుణంలోనే తిరుమలాయపాలెం మండలంలో 40 గ్రామపంచాయతీల పరిధిలో ఎక్కువ శాతం బిసి ఓటర్లు ఉండగా వారిపై అగ్రకులాల వారు పెత్తం చెల్లాయిస్తున్నారు. జెడ్పిటిసి, ఎంపిటిసి సర్పంచ్‌ల ఎన్నికలు వస్తున్నాయంటే సామన్య ప్రజలు ఆందోళన గురవుతారు. ఈ సమయంలో మండలంలో కొన్ని సంవత్సరాల నుంచి ఎన్నికల జరిగిన ప్రక్రియను గమనిస్తే ఎన్నో సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. పిండిప్రోలు, సుబ్లేడు, కొక్కిరేణి, జల్లేపల్లి, కాకరవాయి, జూపెడ, తిరుమలాయపాలెం, తెట్టెలపాడు, తాళ్ళ చెర్వు, ఎర్రగడ్డ, శుద్ధవాగుతండ గ్రామాలు పాటు మరి కొన్ని గ్రామాల్లో వివిధ పార్టీల పోటీదారుల మధ్య ఘర్షణలు జరిగేవి ఇప్పటికి అదే ఆనవాయితీ వస్తుంది. కాని పోలీసులు ఇప్పటికే గ్రామాలను గుర్తించి అక్కడి స్థానిక రాజకీయ నాయకులకు కౌన్సిలింగ్ బైండోవర్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గురువారం ఎన్నికల కమీషన్ నామినేషన్లను స్వీకరించాలని ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడంతో మరి ఈ గ్రామాలపై పోలీసులు ఎప్పుడు పట్టు సాధిస్తారు అని స్థాని ప్రజలతో పాటు పలు రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

# స్థానిక ఎన్నికల్లో బిఆర్‌ఎస్ విజయం ఖాయం

-ఎంపి వద్దిరాజు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా, ఏ రూపంలో వచ్చినా బిఆర్‌ఎస్ విజయం ఖాయమని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రధానమైనవని నాయకులు కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. బుధవారం బిఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహాక సమావేశం స్థానిక సప్తపది ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షులు తాతా మధు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని రాష్ట్రం పదేళ్ల వెనక్కి పోయిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వద్దిరాజు ఆరోపించారు. అధికార పక్షం నాయకుల ప్రోద్బలంతో కేసులు పెడుతున్నారని ఖమ్మం పోరాటాల గడ్డ అని కేసులకు భయపడే ప్రసక్తే లేదని ఆయన తెలిపారు. ఐక్యతతో ఈ నిర్బంధాలను ఎదుర్కోవాలని ఆయన సూచించారు. రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ నుంచి బిఆర్‌ఎస్‌లోకి వలసలు ప్రారంభమయ్యాయని ఖమ్మం జిల్లా రాజకీయ చిత్ర పటం కూడా మారిపోనుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఏలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, నాయకులు పగడాల నాగరాజు, తిరుమలరావు, బెల్లం వేణుగోపాల్, బానోత్ మంజుల, అజయ్‌కుమార్, కృష్ణార్జున్‌రావు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ ప్రయోజనాలకై పోరాటం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉద్యోగ విరమణ చేసి ఏళ్లు గడుస్తున్నా ప్రయోజనాలు అందడం లేదని పదవి విరమణ ప్రయోజనాల కోసం దశల వారీ ఆందోళనలు చేపట్టాలని విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం నిర్ణయించింది. బుధవారం ఖమ్మంలో విశ్రాంత పోలీస్ అధికారుల సంఘ సమావేశం జిల్లా అధ్యక్షులు ఆర్. రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఉద్యోగ విరమణ ప్రయోజనాలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచినందున పోలీస్ కుటుంబాలు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని కొందరు చనిపోయినా ప్రయోజనాలు అందక పోవడం బాధాకరమన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, మంత్రి వర్గంలో ఉన్న ప్రయోజనం చేకూరడం లేదన్నారు. దశల వారీ ఆందోళనలతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. విశ్రాంత ఏఎస్ఐ శీలం పిచ్చిరెడ్డి సంఘానికి రూ. 50వేల విరాళం అందజేయగా సమావేశంలో జిల్లా కార్యదర్శి రుద్ర వెంకటనారాయణ, విశ్రాంత పోలీస్ అధికారులు, మాజీ ఎంఎల్ఎ రాములు నాయక్, ప్రతాపరెడ్డి, అశోక్‌కుమార్, సాయిబాబా, నర్సయ్య, ఈశ్వరయ్య, ఆకుల వెంకయ్య, కె. దక్షిణామూర్తి, ఆర్. వెంకటేశ్వర్లు, షబ్బీర్‌అలీ, ఎం. వెంకట్రావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నిబంధనలపై పోలింగ్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ అధికారి ముజాహిద్ తెలిపారు. బుధవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలానికి కేటాయించిన పోలింగ్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 110 మంది పోలింగ్ అధికారులకు తొలి విడత శిక్షణనందించారు. ట్రైనర్ శేషు ఎన్నికలకు సంబంధించి అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో నామినేషన్ ప్రక్రియ, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై పివోలకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో శ్రీనివాసరెడ్డి, ఎంఈవో రాములు, అధికారులు పాల్గొన్నారు.

# బోనకల్‌లో కాంగ్రెస్ పార్టీకి షాక్

- కాంగ్రెస్ నుంచి బిఆర్‌ఎస్‌లోకి భారీ చేరికలు



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల కేంద్రం బోనకల్‌లో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఈ మధ్య కాలంలో హైద్రాబాద్ వెళ్లి భట్టివిక్రమార్కతో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న కొంత మంది కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం సాయంత్రం బిఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. బోనకల్‌కు చెందిన మరీదు శ్రీను, మరీదు వెంకటి, బాణోతు వెంకటేశ్వర్లు, మోర్ల రమేష్, మంద వెంకయ్య, మోర్ల మురళీ, మరీదు గోపి, ఎరుకుల శ్రీనుతో పాటు పలు కుటుంబాలు బోనకల్ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జున్‌రావు, గ్రామశాఖ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శి తేలూరి రమేష్ ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ పార్టీ కుండవాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సరైన పద్దతిలో తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించలేకపోతుందని, ప్రజపాలన అంటూ కేవలం నాయకులు పరిపాలన చేసుకుంటూ ఇచ్చిన హామీలను విస్మరించి కేవలం తెలంగాణలో నాయకుల పరిపాలన మాత్రమే నడుస్తుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో టిఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాణోతు కొండ, యార్లగడ్డ చిన్ననర్సింహా, గంగుల పుల్లయ్య,మోర్ల శ్రీను, మంద రమణ, మరీదు శేషు, కృష్ణయ్య పాల్గొన్నారు.

# గుడిపూడి నాగేశ్వరరావు మృతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులు గుడిపూడి వెంకటేశ్వరరావు తండ్రి గుడిపూడి నాగేశ్వరరావు మంగళవారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగేశ్వరరావు తుదిశ్వాస విడిచారు. ఈయన మృతి వార్త తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు తదితరుల ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం రైతు జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మధిర డివిజన్ నాయకురాలు జొన్నలగడ్డ సునీత, రఘునాథపాలెం మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు, బోనకల్ మండల కార్యదర్శి కిలారు సురేష్, సీనియర్ నాయకులు ఉమ్మినేని కోటయ్య, మాదినేని లక్ష్మి , కొమ్ము శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రారంభం






**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం పొన్నెకల్లుపంచాయతీపరిధిలోని శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌ల ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం రెండు వారాల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం బుధవారం ప్రారంభం అయ్యింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ...విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బలమైన పూనాదిగా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ దోహదపడుతుందన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీ విద్య, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మి నారాయణ, అకాడమిక్ డీన్ డాక్టర్ వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వైశాలి, పాలిటెక్నిక్ ఇన్‌చార్జి సిహెచ్ కృష్ణప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ చింరజీవి, డాక్టర్ ప్రణతి, డాక్టర్ జ్యోతి, శ్రీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కత్తి నెహ్రూకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం నుంచి విరమణ పొందిన కత్తి నెహ్రూను మున్నూరు కాపు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గతంలో యూత్ కాంగ్రెస్‌లో పనిచేసి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించిన నెహ్రూ బిసి సంఘాల తరుపున పలు ఆందోళనకు నాయకత్వం వహించారని బిసి సంఘం నాయకులు శెట్టి రంగారావు తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత బిసి సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని ఆయన కోరారు.

# ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి



**- నేటి నుండి నామినేషన్ల స్వీకరణ**
**- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల విధులను సంబంధిత సిబ్బంది సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నుండి జిల్లా ఎన్నికల నోడల్ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణుగోపాల రావుతో కలిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలపై సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రతీ అధికారీ తన బాధ్యతను కట్టుదిట్టంగా సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా న్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంసిసి నిబంధనలు కఠినంగా అమలు చేయాలని, ఉల్లంఘనకు పాల్పడిన వారిపై ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సున్నిత, అతి సున్నిత కేంద్రాలను గుర్తించి సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. మండల కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎంపిడీఓ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు. రిటర్నింగ్ ఆఫీసర్లు స్వీకరించిన నామినేషన్లను అదే రోజు టి పోల్ సైట్‌లో అప్‌లోడ్ చేయాలని, సాయంత్రం నాటికి రోజు వారీ నివేదికలు అందించాలని ఆదేశించారు. జెడ్పిటిసి నామినేషన్ల ప్రక్రియ సంబంధిత ఆర్‌డిఓ, సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో కొనసాగుతుందని తెలిపారు. తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన తర్వాత బ్యాలెట్ పేపర్ తయారీ, ముద్రణ ఖచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. నేటి ఉదయం నుండి నామినేషన్ల స్వీకరణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, జిలాల్ పంచాయితీ అధికారి రాంబాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి పాఠశాల క్రీడలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా కేంద్రంలోని ప్రకాశం మైదానంలో 69వ ఎస్‌జిఎఫ్ జిల్లా స్థాయి పాఠశాల క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ లాంఛనంగా ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర స్థాయిలో ఆడి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని, ఓటమి పాలైన వారు మరిన్ని మెలుకువలు నేర్చుకుని విజయానికి కృషి చేయాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడల్లో 17సం. విభాగంలో బాలబాలికలు, గురువారం 14సం. విభాగంలో బాలబాలికలు జరుగుతాయన్నారు. విజేతలను రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఉమ్మడి జిల్లా జట్టుతో కలిపి పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరంధామరెడ్డి, నీరజ, ప్రేమ్‌కుమార్, వేణుగోపాల్, యుగంధర్, స్టెల్లా, కవిత, వీరన్న, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేటికి వాయిదాతో అశావహుల్లో ఉత్కంఠ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బిసి రిజర్వేషన్‌పై హైకోర్టు తీర్పును రేపటికి వాయిదా వేయడంతో ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బుధవారం ఏదో ఒక విషయం ఒక కొలిక్కి వస్తుందని అనుకున్నప్పటికీ నేటి వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా ఇప్పటికే అధికారులు ఎన్నికల సన్నాహాల్లో బిజీబిజీగా ఉన్నారు. బ్యాలెట్ బాక్సులను సైతం ఆయా ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ నేతృత్వంలో సమావేశాలు నిర్వహించి సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి నెలకొంది. వారు వారితో పొత్తు, వీరు వారితో పొత్తు అంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ పార్టీతో సిపిఐ పొత్తు కొనసాగుతుంది. బిఆర్ఎస్ తో సిపిఎం జతకడుతుందనే వాదన బలంగా వినవస్తోంది. పొత్తులతో ముందుకు పోతున్నప్పటికీ బలమైన చోట్ల పోటీలో నిలిచేందుకు ఆయా పార్టీలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. పలు రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పల్లెల్లో స్థానిక ఎన్నికల సందడి జోరుగా ఉంది. జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందు ఆసక్తి ఉన్న అభ్యర్థులు తాము పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించుకుంటున్నారు. మహారాష్ట్ర మాదిరిగా భంగపాటుకు గురయ్యే అవకాశం ఉందని, ఆచితూచి ఖర్చులు చేయాలంటూ సీనియర్లు సలహాలు ఇస్తున్నారు. జెడ్పిటిసి ఎన్నికల జిల్లాలో దుమ్ముగూడెం, గుండాల జనరల్ స్థానాలు కావడంతో అందరి చూపు ఇటు వైపే ఉంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పోటీ చేసే అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తూ తీసుకుంటోంది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య నేతృత్వంలో ఇప్పటికే నియోజవర్గ స్థాయి సమావేశాలు పూర్తి చేశారు. నేడు స్థానిక ఎన్నికల విషయంలో బిసి రిజర్వేషన్ తీర్పుపై ఉత్కంఠ వాతావరణం నెలకొనగా, ప్రజానికం ఆసక్తిగా ఎదురు చూస్తోంది.

# దీపావళి టపాసుల అక్రమ నిల్వలపై టాస్క్ ఫోర్స్ దాడులు



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని దిపావళి టపాసుల అక్రమ నిల్వలపై టాస్క్ ఫోర్సు అధికారులు, భద్రాచలం పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీ, ఇండస్ట్రీయల్ ఏరియా, గ్యాస్ గోదాము ఏరియా తదితర ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా జనావాసాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వారి నుండి రూ.10 లక్షల విలువ చేసే టపాసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ రమాకాంత్, సిఐ నాగారాజు మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు అక్రమంగా నిల్వలు ఉంచిన, విక్రయాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు కూడా 100 డైయిల్ చేసి విషయాన్ని చెప్పి సహకరించాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు అధికారులు రమాకాంత్, ప్రవీణ్, రామారావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి అమానుషం



**- డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడి అమనూషమని, ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ అన్నారు. డిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించిన అనంతరం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఖజురహోలోని ఆలయాల విషయం పురావస్తు శాఖ పరిధిలో ఉందని, సుప్రీం కోర్టు గుమ్మం తొక్కే బదులు అక్కడికే వెళితే బాగుంటుందనే గవాయ్ సూచించారని, దానికి ఆగ్రహించిన మతోన్మాద న్యాయవాది రాకేష్ కిషోర్ సనాతన ధర్మ జోలికి వస్తే ఈ దేశం సహించబోదని నినాదాలు చేస్తూ బూటుతో సిజెఐపై దాడి చేయడానికి ప్రయత్నించగహా మార్షల్స్ అడ్డుకున్నారని అన్నారు. దళిత జాతికి చెందిన జస్టీస్ పై మతోన్మాది దాడికి పాల్పడటంపై ఎస్సీ, ఎస్టి అట్రాసిటి కేసు నమోదు చేసి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుండి తక్షణమే బహిష్కరించి నాన్ బెయిల్ బుల్ కేసు నమోదు చేయాలన్నారు. దీనిని జస్టీస్‌పై దాడిలా కాకుండా భారతరాజ్యాంగంపై జరిగిన దాడిలా చూడాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిహచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు చెన్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరిషా రత్నకుమారి, రాష్ట్ర సమితి సభ్యురాలు మామిడి దనలక్ష్మి, నాయకులు రవి కిరణ్, కొచ్చర్ల రాకేష్, కాంత్, టి నర్సింహారావు, జంగం ప్రసాదరావు, మంద నిర్మల, పి భాగ్య, మద్దెల విజయలక్ష్మి, మెరుగు అనూసయ, దార్ల లక్ష్మి, అన్నెం లక్ష్మి నారాయణ, పి రోజా, ఉస్మాన్ ఖాన్, నర్సిరెడ్డి, సత్తెమ్మ, భారతి, ఆశబి, యాకూబ్ పాషా, అహ్మద్‌పాషా, బట్టు సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్యశిబిరం



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** భద్రాచలం రోటరిక్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పశు సంవర్ధక శాఖ సహకారంతో మండల పరిధిలోని రేగుబల్లి గ్రామంలో బుధవారం మెగా పశు వైద్యశిభిరం నిర్వహభించారు. ఈసందర్భంగా వెటర్నరి వైద్యులు డా. ఎన్ లిఖిత, డా. సుధారాణి లు గ్రామంలోని పశువులకు వైద్యరీక్షలు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు చూచనలు సలహాలు అందించారు. సీజనల్ వ్యావులపై అవగాహన కల్పించారు . ప్రతి మూడు నుండి ఆరు నెలలకు ఒకసారి పశువులకు వ్యాదులు సోక కుండా టీకాలు అందిండం ద్వారా వ్యాదుల నుండి కాపాడు కోవచ్చని తెలిపారు. ఫుడ్ అండ్ మౌత్ వ్యాదులు,హెమరాజిక్ సెప్టిరియా ,బ్లాక్ క్వార్టర్ వంటి ప్రమాదకర వ్యాదులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రైతులకు ఔషదాలను ఉచితంగా అందిచారు. ఈకార్యక్రమంలో వి.వరలక్ష్మి, పి బాల కృష్ణ, మహేంద్ర హరి ప్రసన్న కుమార్ షేక్ అజీమ్ , మల్లి కార్జున రావు, యశోద రాంబాబు, ప్రభాకర్ గుప్త , జక్కరయ్య, మధుసూదన్ రావు, విక్టోరియా , ఎల్ ఎఫ్ శేషుకుమార్ పాల్గోన్నారు.

# కార్పెంటర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** కార్పోరేట్ శక్తుల ప్రవేశంతో కార్పెంటర్‌లకు ఉపాధి లేకుండా పోతున్నదని సిపిఐ రాష్ట్ర సమితి సబ్యులు ముత్యాల విశ్వనాథం ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక చంద్రా రాజేశ్వరరావు భవనం సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి అనుబంధ మండల, పట్టణ స్థాయి కార్పెంటర్స్ మహాసభ బుధవారం జరిగింది. ఈ సంధర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ కార్మికులు తమ పోరాటాలతో సాధించుకొన్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసి వేస్తున్నదని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్మిక చట్టాలను కార్పోరేట్ వర్గాలకు అనుకూలంగా తీసుకొస్తున్నదని మండిపడ్డారు. దీనితో కార్మికులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పెంటర్లకు ప్రభుత్వం నుండి కలపను వేలం లేకుండా నామమాత్రపు ధరకు ఇచ్చి వారి ఉపాధికి భరోసా కల్పించాలన్నారు. 55 సంవత్సరాలు దాటిన ప్రతీ కార్పెంటర్‌కు ప్రభుత్వం పించన్



మంజూరు చేసి ఇందరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం కార్పెటర్స్ మండల, పట్టణ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఏఐటియుసి కార్యదర్శిట్టి వెంకటరావు, నాయకులు కాసర్ల రామారావు, మడుపు ఉపేంద్రాచారి, వైకుంఠనాథం, బాబూచారి తదితరులు పాల్గొన్నారు.

# సిఎంపిఎఫ్ వివరాలు తెలపాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** సింగరేణి కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం వైసీఓఏ క్లబ్ నందు సీఎంపిఎఫ్ ట్రైపార్టెడ్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సీఎంపిఎఫ్ వివరాలు సక్రమంగా సీకేర్ పోర్టల్ నందు పొందుపరచాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సీఎం పిఎఫ్, పెన్షన్ త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ఇల్లందు ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సీఎం పిఎఫ్ వివరాలు సీ కేర్ పోర్టల్ నందు పొందుపరచాలని కోరారు. ఇల్లందు ఏరియా పలు విభాగాల్లో వాహనాలకు డ్రైవర్లుగా ఉన్న వారి సీఎం పిఎఫ్ వివరాలు వెల్లడించాలని కోరారు. పలు అంశాలపై ఈ ట్రైపార్టైంట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా రీజనరల్ కమిషన్ వంశీధర్‌కి స్థానిక జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య సమక్షంలో వినతి పత్రం అందించారు. రీజినల్ కమిషనర్ వంశీధర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారం, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి భాస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభను ఘనంగా నిర్వహించాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**







**ప్రజాపక్షం/వైరా:** డిసెంబర్26న జరుగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ముగింపు ఉత్సవాలను ఖమ్మంలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాల్లో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలతో పాటు సామాజిక వర్గాలు, పేద ప్రజలు మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం వైరా సిపిఐ కార్యాలయంలో యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగిన వైరా నియోజకవర్గస్థాయిలో జిల్లా కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు మండల కార్యదర్శులు సమావేశంలో ముఖ్య అతిధిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బండి సురేష్ పాల్గొన్యానరు. ఈస ఒదర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ భారతదేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏకైక జాతీయ పార్టీ కమ్యూనిస్టు మాత్రమే అని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిసారిగా పిలుపునిచ్చి అనేక త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని, ఆ తర్వాత దేశంలో భూసంస్కరణలు బ్యాంకుల జాతీయరణ దున్నే వాడికి భూమి దక్కాలని అనేక భూ పోరాటాలు నిర్వహించిన ఘనత ఉందని, కార్మికులకు హక్కులు సాధించబడిన పేద ప్రజలకు ఇళ్లు నిర్మించాలని పేదవాడికి ఉచిత వైద్యం ఉచిత విద్య ప్రభుత్వం అందించాలని అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉందని, నిజాం వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించిన చరిత్ర ఉందని అన్నారు. దేశ వ్యాప్తంగా శత జయంతి ఉత్సవాలు ముగింపు సభ ఖమ్మంలో జరగడం మనందరికి గర్వకారణం అని అన్నారు. ఇదే సందర్భంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను అన్ని స్థానాల్లో గెలిపించుకోవడానికి గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా ఎన్నికల్లో పాల్గొని విజయాలు సాధజంచాలని కోరారు.

### దండి సురేష్‌కు సన్మానం...

సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా వైరా సిపిఐ కార్యాలయానికి వచ్చిన జిల్లా కార్యదర్శి దండి సురేష్‌ను సిపిఐ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్, కొణిజర్ల, జూలురుపాడు మండలాల కార్యదర్శిలు గుండెపిన్ని వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్యణ రమేష్, షేక్ నాగుల్‌మీరా, సింగరేణి మండలం సీనియర్ నాయకులు బానోతు దళ్‌సింగ్, ఎల్లంకి మధు, మిట్టపల్లి రాఘవరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, నాసా రోశయ్య, కంపసాటి వెంకన్న, రేమల్ల నారాయణ, కొండా రామకృష్ణ, బాల రాంబాబు, ముత్తయ్య, బండారుపల్లి ముత్తయ్య, మూట కొండ, గారపాటి అశోక్, డేవిడ్‌రాజ్, అడుసుమల్లి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసి లక్కీ డ్రా విజేతలు ఎంపిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దసరా పండుగ సందర్భంగా ఆర్టిసి బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు నిర్వహించిన లక్కీ డ్రాకు సంబంధించి విజేతలను ఎంపిక చేశారు. బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సమక్షంలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా రవాణాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భం గా ఆర్టిసి ఎండి నాగిరెడ్డి సహకారంతో ఆర్టిసి బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు లక్కీ డ్రా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ముగ్గురు విజేతలను ఎంపిక చేశామన్నారు. విజేతలకు హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 28న ఖమ్మం డిపోకు చెందిన రాజధాని బస్సులో హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ప్రయాణం చేసిన కాంతారావుకు మొదటి బహుమతి, అక్టోబర్ ఆరున భద్రాచలం సూపర్ లగ్జరీ బస్సులో కొత్తగూడెం నుంచి భద్రాచలం వరకు ప్రయాణం చేసిన సాయిబాబకు రెండవ బహుమతి, మణుగూరు డిపోకు చెందిన డిలక్స్ బస్సులో సెప్టెంబర్ 29న మణుగూరు నుంచి పినపాక వరకు ప్రయాణం చేసిన సునీల్‌కుమార్‌కు మూడవ బహుమతికి ఎంపికయ్యారన్నారు. దసరా పండుగ సందర్భంగా ఆర్టిసి బస్సుల్లో ప్రయాణం చేసిన ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి. మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ ఎం. శివప్రసాద్, సెక్యూరిటీ అధికారి కోటాజీ, విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

# బూటకపు వాగ్ధానాలతో ప్రజలను మోసం చేసిన బిఆర్ఎస్

**- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల**



**ప్రజాపక్షం/మధిర :** గతంలో బూటకపు వాగ్ధానాలతో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం మధిర మండలం దెందుకూరులో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు బూటకపు వాగ్ధానాలు ఇచ్చి పది సంవత్సరాలు అధికారాన్ని అనుభవించిన కేసిఆర్, కేటిఆర్ ఈ రోజు ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలోనే ఇచ్చిన వాగ్ధానాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంట్, రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు బంధు, పేదలకు ఇందిరమ్మ ఇల్లు, సన్నబియ్యం పంపిణీ , ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ వికాసం పథకం ద్వారా నిరుద్యోగులను ఆదుకోవాలని ప్రణాళికలు రూపొందించటం, ఆరోగ్యశ్రీ ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు పెంచి పేదలకు అండగా నిలబడ్డ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసిఆర్, కేటిఆర్ వాళ్ళ స్థాయికి దిగజారి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా స్థాయిలో పదవులు అనుభవించిన నాయకులు పది కోట్ల రూపాయల నిధులు కూడా మధిర నియోజకవర్గానికి తీసుకురాలేదని, నేడు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క నాయకత్వంలో నియోజకవర్గానికి ఐదారు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణ గుప్తా, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అల్ట్రాసౌండ్ యంత్రం స్వాధీనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అనాధికారికంగా ఉపయోగిస్తున్న పోర్టబుల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి. కళావతి బాయి బుధవారం తెలిపారు. డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో చందునాయక్, ఖమ్మం అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ నగర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రం, ఒక ప్రోబ్, రెండు జెల్ సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఖమ్మం నగర పరిధిలో పాండురంగాపురంకు చెందిన సల్లోజ వెంకటేష్, వైఎస్ఆర్ కాలనీకి చెందిన భానోత్ హుస్సేన్‌లు ఎటువంటి అనుమతులు లేకుండా స్కానింగ్‌లు నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. వారిపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని డిఎంఅండ్‌హెచ్‌వో తెలిపారు.

# ఎల్ఆర్ఎస్ సమస్యలను పరిష్కరించుకోండి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో వివిధ కారణాల చేత ఆగిపోయిన ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ నిర్వాహకులు వాటిని పరిష్కరించుకొని పూర్తి చేసుకోవాలని వైరా మున్సిపాల్ కమీషనర్ గురులింగం అన్నారు. బుధవారం వైరా మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికల భాస్కర్, శానిటేషన్ అధికారి వీరన్నతో కలిసి ఆయన మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీకి 3532 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయని, అందులో 725 దరఖాస్తులకు పూర్తిగా ఫీజు చెల్లించడం జరిగింది. ఫీజు చెల్లించిన వాటిలో 494 దరఖాస్తులను పరిష్కరించి క్లియర్ చేయడం జరిగింది. ఫీజు చెల్లించి క్లియర్ చేసుకొని 190 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటికి సరైన ధృవపత్రాలు చూపించకుండా ఆగిపోవడం జరిగిందని, 190 అప్లికేషన్‌లకు ఎల్ఆర్ఎస్ ఫీజు కట్టిన నిర్వాహకులు తక్షణమే మున్సిపాల్ కమీషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు సంప్రదించి వాటికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లు సమర్పించి ఎల్ఆర్ఎస్ క్లియర్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎల్ఆర్ఎస్ ద్వారా వైరా మున్సిపాలిటీకి రూ.2.35కోట్ల ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు క్లియరెన్స్ కాని వారు త్వరగా వాటిని పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు.

# తప్పులు దొర్లకుండా విధులు నిర్వహించాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక ఎన్నికలలో తప్పులు దొర్లకుండా విధులు నిర్వహించాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల కేంద్రంలో ఎన్నికల ప్రిసిడింగ్, అసిస్టెంట్ ప్రిసిడింగ్ అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి ప్రకారమే విధులు చేపట్టాలని అన్నారు. వివాదాలకు తావులేకుండా విధుల పట్ల అప్రమతంగా ఉండాలని సూచించారు. స్థానిక ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ శిక్షణ లో రిసోర్స్ పర్సన్ పెద్ది జగన్నాధం పీవో, ఏపీవో బాధ్యతలు, విధులను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు, మండల పంచాయతీ అధికారి సి.హెచ్. శివ, ఏపీవోలు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి దంతెలబోర ఎస్‌సి కాలని, బంద్రుగొండ గ్రామాలలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటయిన ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తున్నదని అన్నారు. గ్రామాల అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళి అవగాహన కల్పించి పార్టీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ఎర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, జాలె జానకీరెడ్డి,పెద్దమ్మతల్లి దేవస్థాన ధర్మకర్తల మండల చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, నాయకులు ధర్మసోత్ ఉపేందర్ నాయక్, జమ్ముల రాజశేఖర్, కాకా శ్రీనివాసరావు,బెల్లం అలివేలు, బోద శ్రీలతారెడ్డి, గోసుల సతీష్, కొర్రయ్య, తెల్లం మల్లేష్, పోలెబోయిన వెంకటేశ్వర్లు, కంటె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో పలువురి చేరిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో పలువురు చేరారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో రఘునాథపాలెం, ఈర్లపుడి గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన 85 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. రఘునాథపాలెం బిఆర్ఎస్ పార్టీ నాయకులు గాజుల కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్నవెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, మండల కన్వీనర్ దీప్లానాయక్, గుడిపూడి రామారావు,రెంటాల ప్రసాద్, దేవ్‌సింగ్, బోయన వెంకటనర్సయ్య, అల్లిక సీతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైన్ షాపులకు 37 టెండర్లు దాఖలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో వైన్ షాపులకు ఇప్పటి వరకు 37 టెండర్లు దాఖలయ్యాయని ఖమ్మం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఖమ్మం ఎక్సైజ్ 1 స్టేషన్ పరిధిలో 24, ఖమ్మం ఎక్సైజ్ 2 స్టేషన్ పరిధిలో మూడు, మధిర స్టేషన్ పరిధిలో రెండు, సత్తుపల్లి స్టేషన్ పరిధిలో నాలుగు, సింగరేణి స్టేషన్ పరిధిలో మూడు, వైరా స్టేషన్ పరిధిలో ఒకటి టెండర్ దాఖలైనట్లు తెలిపారు. టెండర్ల స్వీకరణకు ఈనెల 18 వరకు గడువు ఉందని ఆయన తెలిపారు.